క్లుప్తంగా

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి

భీమునిపట్నం : భీమిలిలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారు వరాహావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అవతార విశిష్టతను భక్తులకు తెలియజేశారు.

భవిత కేంద్ర నిర్వహణ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న అమ్మినాయుడు

భీమునిపట్నం : భీమిలిలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించిన భవిత కేంద్రాన్ని గురువారం ఆ కేంద్రాల రాష్ట్ర పరిశీలకుడు ఎన్.అమ్మినాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లల ప్రవర్తన, వారి సామర్థ్యాలు, మాట్లాడే తీరు, నైపుణ్యాలను పరిశీలించారు. అలాగే సిబ్బంది ఏ విధంగా బోధిస్తున్నారు, తీసుకుంటున్న జాగ్రత్తలు, చర్యలు తెలుసుకోవడంతోపాటు రికార్డులు పరిశీలించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలకు అవసరమైన ఫిజియోథెరపిస్ట్‌ను త్వరలో నియమిస్తామని తెలిపారు, జిల్లా విద్య కో ఆర్డినేటర్ గీత, ఎంఈవోలు శివరాణి, జయప్రద, ఉపాధ్యాయులు ఎ.కేజియా కుమారి, పి.పార్వతి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస : చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా 11 కేవీ తాటితూరు రూరల్, తాటితూరు పంచాయతీ, దాకమర్రి వాటర్‌వర్క్స్, చెరకుపల్లి అవంతి విద్యా సంస్థలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

తగరపువలస : 33/11 కేవీ చిట్టివలస టౌన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ అంతరాయం కారణంగా ఉప్పలపేట, సంగివలస, ఇడదాసరిపేట, చిల్లపేట, జీవీఎంసీ జీరుపేట, నమ్మివానిపేట, ఎన్ఆర్ఐ ఆస్పత్రి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

రైల్వే స్టేషన్ నుంచి గంభీరం వరకు సిటీ బస్సు సౌకర్యం

దాబాగార్డెన్స్:భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ గంభీరం వరకు రూట్ నంబరు 25 – ఐఐఎమ్ సిటీ బస్సు సౌకర్యం కల్పించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. ఈ బస్సు రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం, హనుమంతువాక, మధురవాడ, మారికవలస మీదుగా ఐఐఎంకి చేరుకుంటుందని తెలిపారు.

రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరు సమయం
ఉదయం 07:30, 10:20 మధ్యాహ్నం ఒంటి గంటకు..

ఐఐఎం నుంచి బయలుదేరు సమయం
ఉదయం 08:55, 11:35, మధ్యాహ్నం 14.30, 18:15

అమ్మల ఆశలపై నీళ్లు

- 'తల్లికి వందనం' పేరుతో చంద్రబాబు మార్కు మోసం
- ఇంటిలో చదువుకునే పిల్లలందరికీ రూ.15వేలు చొప్పున చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ
- ప్రస్తుతం ఒక్కో తల్లికి రూ.15 వేలు మాత్రమే అందిస్తామని జీవో
- చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోయామని అమ్మల ఆవేదన
- వైఎస్సార్ సీపీ పాలనలో 'అమ్మ ఒడి' పేరుతో నియోజకవర్గంలో రూ.202.89 కోట్ల జమ

తగరపువలస : మరోసారి తనదైన శైలిలో మాత్ర మూర్తులను మోసం చేసేందుకు చంద్రబాబు సిద్ధమయ్యాడు. ప్రతీ విద్యార్థి చదువుకోవాలని, అందుకు తల్లిదండ్రులూ సహకరించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 'అమ్మ ఒడి' పేరుతో అండగా నిలిచారు. ఇంటిలో ఒక విద్యార్థికి రూ.15 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేసి పేదల విద్యకు భరోసా కల్పించారు. అయితే అధికారమే లక్ష్యంగా టీడీపీ, జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎంత మంది పిల్లలు స్కూల్, కళాశాలలో చదివితే అందరికీ 'తల్లికి వందనం' పేరుతో రూ.15 వేలు వంతున ఇస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'అమ్మ ఒడి' పేరుతో ఒక్కరికే ఏడాదికి రూ.15 వేలు ఇచ్చిందని... ఎందరు చదివితే అందరికీ రూ.15 వేలు చొప్పున తాము అధికారంలోకి వచ్చాక చెల్లిస్తామని ప్రచార సభల్లో ఉదరగొట్టారు. దీంతో కూటమి నాయకుల మాయమాటలు నమ్మిన ప్రజలలో చాలా మంది ఈ విద్యా సంవత్సరం నుంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు మార్చారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల తర్వాత 'తల్లికి వందనం' ఇంటిలో ఒక్కరికే ఇస్తామని అనడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరుంటే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఉదరగొట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇప్పుడు మాట తప్పుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భీమిలి నియోజకవర్గంలో నాలుగు విడతలుగా 44,617 మంది తల్లుల ఖాతాలో రూ.202.89 కోట్లు జమ చేసింది.



తగరపువలసలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



స్కూల్‌కు వెళ్లే ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు చొప్పున చెల్లిస్తామని టీడీపీ ఇచ్చిన ప్రకటన

ఇద్దరు పిల్లలకీ చెల్లించాలి



మా పెద్దమ్మాయి భవ్యశ్రీ 5, చిన్నకుమార్తె తనూష 1 తరగతి చదువుతున్నారు. చిట్టివలసలోని శారద పబ్లిక్ స్కూల్‌లో చదివిస్తున్నాను. స్కూల్ ఫీజులు, బస్సు కోసం ఏడాదికి రూ.60వేలు ఖర్చవుతోంది. కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ.15వేలు వంతున ఇస్తామన్నారు. ఇప్పుడు అందరికీ డబ్బులివ్వాలి.

– పోతల దుర్గాదేవి, రావాడ

పిల్లల ఫీజులు చెల్లించాలి



మా పిల్లలు మేఘన 7, హిమబిందు 4వ తరగతి చిట్టివలస శ్రీరామకృష్ణ స్కూల్‌లో చదువుతున్నారు. వీరికి ఏడాదికి రూ.26 వేల వరకు పుస్తకాలకు కాకుండా ఫీజులకు ఖర్చవుతున్నాయి. నా భర్త ఆటో నడుపుతుంటారు. 'తల్లికి వందనం' డబ్బులు వస్తే పిల్లలకు ఫీజులు చెల్లించుకోవడానికి ఇబ్బంది ఉండదు. ప్రభుత్వం స్పందించి త్వరగా చెల్లించాలి.

– వెంపాడ లక్ష్మి, చిట్టివలస

డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం



భీమిలి కేథరిన్ స్కూల్‌లో మా పిల్లలు ఆశ్విన్ 9, విశేష్ 6వ తరగతి చదువుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నాయకులు పాఠశాలకు వెళ్లే ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకోవాలి. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడిచిపోయినా ఇంకా నగదు జమ చేయలేదు. డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం.

– జమ్ము సునీత, బంగ్లామెట్ట

'తల్లికి వందనం'తో ఫీజు చెల్లిస్తాం



శ్రీవాణి విద్యానికేతన్‌లో మా పిల్లలు వర్మ, మానస 7, 4వ తరగతులు చదువుతున్నారు. వీరికి ఏడాదికి రూ.36 వేలు ఫీజులు చెల్లించాలి. ఇప్పటికే మొదటి వాయిదా చెల్లించాలి. ప్రభుత్వం 'తల్లికి వందనం' కింద చెల్లిస్తామన్న నగదు వెంటనే ఇవ్వాలి. ఆ డబ్బులతో ఫీజులు చెల్లించుకుంటాం.

– జామి ఉమ, కొత్తపేట

ముగ్గురికీ రూ.45 వేలు ఇవ్వాలి



నా భర్త చిట్టిబాబు తాపీ పనులు చేస్తుంటారు. మాకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి సంతానం. ముగ్గురూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పినట్టుగా మా ముగ్గురు పిల్లలకు సంవత్సరానికి రూ.45 వేలు ఇవ్వాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

– వెంపాడ ఆదిలక్ష్మి, సంతపేట

ఆశగా నిరీక్షిస్తున్నాం



మా ఇద్దరు పిల్లలు విష్ణు, జస్వంత్ బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో 5, 3 తరగతులు చదువుతున్నారు. మాకు ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే స్థోమత లేదు. ఎన్నికల ముందు చెప్పినట్టు ఇద్దరు పిల్లలకు సంవత్సరానికి రూ.30 వేలు 'తల్లికి వందనం' పేరుతో చెల్లించాలి. ఆ డబ్బులు వస్తాయని ఆశగా నిరీక్షిస్తున్నాం.

– ఒనుము శ్రీదేవి, బంగ్లామెట్ట

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల్లో టీడీపీ, జనసేన నాయకులు ఇంట్లో ఎంత మంది స్కూలుకు వెళ్లే పిల్లలు ఉంటే అందరికీ రూ.15వేలు చొప్పున 'తల్లికి వందనం' పేరుతో ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన దానికంటే మెరుగ్గా ఇస్తామన్నారు. మా పెద్ద పాప లావణ్య శ్రీ చైతన్య స్కూల్‌లో 8వ తరగతి, వీక్షిత భాష్యం స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. ప్రభుత్వం నగదు చెల్లిస్తే ఫీజులు చెల్లించుకుంటాం.

– పిళ్లా.లక్ష్మి, మధురవాడ

ఫీజుల కోసం అవస్థలు



మా పాప 10వ తరగతి, బాబు సుధీర్ 7వ తగరతి నారాయణ స్కూల్‌లో చదువుతున్నారు. గతంలో వలే ఇప్పుడు కూడా తల్లులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాం. ఇప్పటి వరకూ స్పష్టత లేదు. సాయం అందుతుందో లేదోనని ఆందోళనగా ఉంది. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందని భావిస్తున్నాం. సకాలంలో ఫీజులు కట్టలేక పోవడంతో ప్రైవేటు స్కూలు యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి.

– పిళ్లా.రజని, చంద్రంపాలెం

ఫీజుల కోసం ఒత్తిడి



మా అబ్బాయి పార్థు 8వ తరగతి, పాప వర్షిణి 7వ తరగతి చైతన్య స్కూల్‌లో చదువుతున్నారు. 'తల్లికి వందనం' పేరుతో రూ.15 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు నాయుడు చెప్పారు. ఆ డబ్బులు వస్తే పిల్లల ఫీజులు కడదామని చూస్తున్నాం. గతంలో అమ్మ ఒడి డబ్బులు స్కూళ్ల ప్రారంభమయ్యేసరికే వచ్చేసేవి. ఇప్పుడు కొత్త ప్రభుత్వంలోనూ అలాగే డబ్బులు వస్తాయని అనుకున్నా ఇంత వరకు రాలేదు. ఆశగా ఎదురు చూస్తున్నాం.

– పిళ్లా శాంతి, రేవళ్లపాలెం

ఆ డబ్బులతో ఫీజులు చెల్లిస్తాం



ప్రభుత్వం పిల్లల చదువు కోసం అందిస్తామని హామీ ఇచ్చినట్టు అందరు విద్యార్థులకూ రూ.15 వేలు చొప్పున చెల్లించాలి. నా ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఇప్పుడు స్కూల్ ఫీజులు చెల్లించాలి. ప్రభుత్వం త్వరగా డబ్బులు అందిస్తే పిల్లల ఫీజులు చెల్లించుకుంటాం.

– వి.స్వరూపరాణి, గృహిణి, మామిడిపాలెం

మోడల్‌గా మధురవాడ రైతు బజార్

మధురవాడ : మధురవాడ రైతు బజార్‌లో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు అందించే స్టాల్‌ను గురువారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించేందుకు ఇటువంటి వాటిని ఏర్పాటు చేశామన్నారు. మార్కెట్‌ని అన్ని విధాలుగా అభివృద్ధిచేసి మోడల్ రైతు బజార్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఇలాంటి స్టాల్స్ రిలయన్స్, డి మార్ట్ వంటి సూపర్ మార్కెట్‌లలో కూడా ఏర్పాటు చేసి సబ్సిడీపై సరకులు అందజేస్తామన్నారు. రైతు బజార్ పరిసరాలు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. రైతు బజారులోకి వచ్చేందుకు దారి చిన్నదిగా వుందని, ఎంట్రన్స్, ఎగ్జిట్ ఒకే వైపున్నాయన్నారు. ప్రస్తుతం 83 స్టాల్స్ ఉన్నాయని, వాటిని పెంచాల్సి ఉందన్నారు. మిగిలిపోయిన కూరగాయలు దాచుకోవడానికి సెంట్రలైజ్డ్ కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కోరాడ రాజబాబు, కె.రామానాయుడు, వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, మొల్లి లక్ష్మణ, వాండ్రాసి అప్పలరాజు, మాజీ కార్పొరేటర్ సోంబాబు, కలివేల్పు బుజ్జి, బోయి రమాదేవి, బోయి వెంకటరమణ, ఎస్ఎస్ నాయుడు, అనురాధ పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో పలు సమస్యలు



భీమిలి డైట్ కళాశాల వద్ద జనాభా దినోత్సవ ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం : ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దేశంలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉందని, దీనివల్ల పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ఛాత్రోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జనాభా పెరుగుదల ఎక్కువ కావడం వల్ల వనరులు సరిపోవని, ఫలితంగా జీవనానికి చాలా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ సమస్య ఇతర దేశాల్లోనూ ఉన్నప్పటికీ భారత్‌లో ఎక్కువగా ఉందని, అందువల్ల జనాభా నియంత్రణకు అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అధ్యాపకులు ఎం.మహాలక్ష్మి, ఎల్.సుధాకర్, సి.ఎ.సోమయాజులు, గొట్టేటి రవి, పి.హారిణి పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి

తగరపువలస : కుటుంబాల సంతోషం, సమాజ శ్రేయస్సు కోసం దంపతులు తప్పనిసరిగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.గంగునాయుడు సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహం తర్వాత కనీసం ఏడాదిపాటు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. అవసరమైతే అవగాహనకు 104 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. బిడ్డకు బిడ్డకు మధ్య మూడేళ్లు దూరం ఉండాలన్నారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారి షహనాజ్ సాధియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, సిబ్బంది జయకుమార్, తారకేష్, ఈశ్వరరావు, నర్సింగ్ ప్రతినిధి ఎం.రమ్య పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆనందపురం పీహెచ్‌సీ సిబ్బంది

మంచి అలవాట్లతో ఉజ్వల భవిష్యత్



వెల్లంకిలో కళాజాత ద్వారా బాలల హక్కులపై వివరిస్తున్న బృందం



పెద్దిపాలెంలో బాలికల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు రవీంద్ర నాయక్

తగరపువలస : ఆనందపురం మండలం పెద్దిపాలెంలో గురువారం బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు రవీంద్ర నాయక్ మాట్లాడుతూ బాలికా విద్య, సీజనల్ వ్యాధులపై వివరించారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తాయన్నారు. అనంతరం కళాజాత టీమ్‌కు చెందిన ఎం.బాలాజీ ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు పద్మజ, ఆకుల అభిన్, మోనిషా, అనూష, మంగవాణి, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- వెల్లంకి పంచాయతీలో ఐసీడీఎస్ ద్వారా నిర్వహించిన బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో బాల్య వివాహాలు, బాలల చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తల్లిదండ్రుల ఆటపాటలపై కళాజాత ద్వారా వివరించారు. కార్యక్రమంలో కంచరపు శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది శ్యామల, అప్పలరెడ్డి, పడాల అప్పలనాయుడు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

గొల్లలపాలెంలో చోరీ



బాధితుని ఇంట్లో డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేస్తున్న పోలీసులు

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెంలో బుధవారం రాత్రి మొల్లి పెంటయ్య అనే వ్యక్తి ఇంట్లో దొంగలు పడి 2 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి పట్టీలు, రూ.1.60 లక్షల నగదు దోచుకుపోయారు. బాధిత కుటుంబం మేడపై నిద్రిస్తుండగా మధ్య రాత్రి సమయంలో ఇద్దరు దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. కింద ఇంట్లో అలికిడి కావడంతో పైన నిద్రిస్తున్న బాధితులు వచ్చి చూడగా బయటకు పరుగులు తీశారు. తర్వాత బాధిత కుటుంబ సభ్యులు వెంబడించినా దొంగల ఆచూకీ లభించలేదు. వీరి ఫిర్యాదు మేరకు భీమిలి క్రైం ఎస్ఐ సూర్యప్రకాష్‌రావు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలకు 11 మంది విద్యార్థినుల ఎంపిక


భీమునిపట్నం : భీమిలిలోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకున్న 11 మంది విద్యార్థినులకు రాష్ట్రంలో ఉన్న ట్రిపుల్ ఐటీల్లో సీట్లు వచ్చాయి. ఇందులో బండారు నైమిష, ఎం.త్రిష, సబ్బవరపు మేఘన, తాపేటి దుర్గకు నూజివీడు కళాశాలలో సీట్లు వచ్చాయి. అలాగే పోతుల అఖిల, చిత్రడం చంద్రకళ, కేపీ సాయిదుర్గ, డి.హైందవి, తొక్కడ కళ్యాణికి శ్రీకాకుళం కళాశాలలో, వేసలపు వాసవికి ఒంగోలు కళాశాలలో సీటు వచ్చింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.జయప్రకాశ్ మాట్లాడుతూ ఎక్కువ మార్కులు సాధించిన వారిని ఎంపిక చేసి ఆయా కళాశాలల్లో సీట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థినులకు సీట్లు రావడం ఎంతో ఆనందంగా ఉందని, అందరికీ అభినందనలు తెలిపారు.

తగరపువలస : చిట్టివలస జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు పి.మురళీమోహనరావు తెలిపారు. ఎంపికైన బి.ప్రణవి, ప్రేమ్‌కుమార్ సాహు, జి.భవానీప్రసాద్, పి.అనిల్‌కుమార్, జి.పవన్‌కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

పేదింటి విద్యార్థికి ట్రిపుల్ ఐటీ సీటు

మధురవాడ : పేద కుటుంబానికి చెందిన కొమ్మాది నివాసి బొమ్మా రాహుల్ మనోజ్‌కు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. ఇతని తండ్రి మరణంతో తల్లి లక్ష్మి మధురవాడలోని ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ పిల్లలను చదివిస్తోంది. తండ్రి మరణంతో పాఠశాల మాన్పించే పరిస్థితి రావడంతో మనోజ్‌కి రేవళ్లపాలెంకి చెందిన శ్రీనివాస్ స్కూల్ ప్రిన్సిపాల్ రాయిన శ్రీనివాస్ ఉచితంగా విద్య అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ మేరకు 10వ తరగతిలో 587 మార్కులు సాధించాడు. దీంతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. మనోజ్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

పాఠశాల నిర్వహణలో అలసత్వం వద్దు



చంద్రంపాలెం హైస్కూల్‌లో చర్చిస్తున్న ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో చంద్రకళ

మధురవాడ : పాఠశాల నిర్వహణ, క్రమశిక్షణ విషయంలో అలసత్వం తగదని విద్యాశాఖ ఆర్‌జేడీ విజయ భాస్కర్ అన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, క్రమశిక్షణ, పరిసరాల పరిశుభ్రతపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకి విరాళం చెక్కు అందిస్తున్న హేమలత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని సీబీఐ కాంపౌండ్‌కి చెందిన హేమలత గురువారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావుకి అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం



ఆరిలోవ కాలనీలో సమావేశమైన దివ్యాంగులు

ఆరిలోవ: ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వద్ద గురువారం దివ్యాంగుల రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల రైట్స్ ఫోరం అధ్యక్షుడు సురేష్ మీనస్ మాట్లాడుతూ అంతా సంఘటితంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా కలసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం దివ్యాంగులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.